బిల్లులేవి బాబూ!

- నియోజకవర్గంలో మంజూరైన ఇళ్లు 12,894
- పూర్తయిన ఇళ్లు 9,022
- వివిధ దశల్లో 3,868
- కూటమి అధికారంలోకి వచ్చాక మంజూరు కాని బిల్లులు
- నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం
- గగ్గోలు పెడుతున్న లబ్ధిదారులు



బొమ్మిదొడ్డి జగనన్న లేఔట్‌లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

నియోజకవర్గంలో ఇళ్ల వివరాలు..

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
1.బైరెడ్డిపల్లి	1,961	1,372
2.గంగవరం	1,702	1,311
3.పలమనేరు	1,224	1,024
4.మున్సిపాలిటీ	3,031	1,792
5.పెద్దపంజాణి	1,717	1,308
6.వి.కోట	3,359	9,022
మొత్తం	12,894	9,022

పలమనేరు: సొంతిల్లు కట్టుకోవాలన్న ప్రతి పేదవాని కలను పలమనేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజం చేసింది. అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కా గృహాలను మంజూరు చేయాలనే తలంపుతో నియోజకవర్గంలో 12,894 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 9,022 వేల ఇళ్లు పూర్తికాగా మిగిలిన 3,868 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ దశల్లో నిర్మాణ పనులకు బిల్లులు అందక అర్ధంతరంగా ఆగిపోయాయి. వీటి నిర్మాణాలకు రూ.180 కోట్లను గత ప్రభుత్వం వెచ్చించింది. ఇందులో సగానికిపైగా బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నందున ఇళ్ల నిర్మాణాలు కొండెక్కాయి.

ఇదిగో సాక్ష్యం...

ప్రైవేటు వెంచర్లను తలదన్నేలా పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి జగనన్న కాలనీ లేఔట్ తయారైంది. ఇక్కడ మొత్తం 3,031 ఇళ్లు మంజూరైతే ఇందులో 1,792 ఇళ్లు మాత్రం పూర్తయ్యాయి. నాలుగు ఇళ్లు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలినవి ఆర్‌బీఎల్, బీఎల్(బిలో లింటల్), ఎల్‌ఎల్, ఆర్‌ఎల్ (రూఫ్ లెవల్), ఆర్‌సీ(రూఫ్ కాంక్రీట్) దశల్లో ఉన్నాయి. పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి కాలనీలో మంచి వాతావరణం, పక్కా వాస్తు కలిగిన స్థలంలో కాలనీ ఏర్పాటైంది. లేఔట్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా 30 అడుగులతో రోడ్లకు స్థలాన్ని కేటాయించారు. కాలనీలో పూర్తిస్థాయిలో గత ప్రభుత్వంలోనే ట్రాన్స్‌కో విద్యుద్దీకరణ చేపట్టింది. మున్సిపల్ అధికారులు తాగునీటి కోసం కొత్తగా బోర్లను డ్రిల్ చేసి వాటికి మోటార్లను అమర్చి మంచి నీటి కోసం సింథటిక్ ట్యాంకులను సైతం ఏర్పాటు చేశారు. ఇక వీధుల అభివృద్ధి పనులను, డ్రైన్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇదేవిధంగా నియోజకవర్గంలో 12 లేఔట్లున్నాయి. ఈ విషయమై స్థానిక హౌసింగ్ డీఈ దాస్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు ఇంకా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఆగాయన్నారు.

బిల్లులిస్తేగా కట్టేది...



తన భార్య పేరిట పక్కా ఇల్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైంది. ఇందుకు సంబంధించి ఇప్పటిదాకా రూ.1.20 లక్షలు గత ప్రభుత్వంలోనే వచ్చాయి. కూటమి ప్రభుత్వంలో ఇప్పటిదాకా బిల్లులు రాలేదు. దీంతో ఇంటి పనులు ఆగాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. బిల్లులు వస్తే పని మొదలు పెట్టాలి.

రాజుల్లా, పాపేపల్లి, వి.కోట మండలం

క్లుప్తంగా

గంగినాయనపల్లెలో గంగజాతర



అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లెలో మంగళవారం గంగజాతరను కోలాహలంగా నిర్వహించారు. అమ్మవారి శిరస్సును గ్రామ పొలిమేరల్లో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగించి ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. పశువులను శుభ్రం చేసి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకొచ్చి ఎలాంటి రోగాలు రాకుండా కాపాడాలని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

పులిచెర్ల(కల్లూరు): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీల కతీతంగా అభివృద్ధి పనులు చేసి మండలాన్ని అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర బాబు, ఏఓ మునిరాజ పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: తీర్థం పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం వైద్యాధికారి అరుణ్‌కుమార్ కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠు సోకిన వారు భయాందోళన చెందనవసరం లేదన్నారు. కుష్ఠు వ్యాధి గ్రస్తులకు ఉచితంగా పీహెచ్‌సీలో మందులు పంపిణీ చేస్తామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్‌ఎస్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

శాంతిపురం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నగిరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఏఓ యామిని తమ బృందంతో కలిసి దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందులు, వాటి నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి అప్పోజి పాల్గొన్నారు.

జనారణ్యంలోకి దుప్పి



గాయపడిన దుప్పిని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి పంచాయతీ బొమ్మలకుంట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి దుప్పి మంగళవారం గ్రామంలోకి వచ్చింది. ఈ క్రమంలో కుక్కలు దుప్పిని తరమడం చూసిన గ్రామస్తులు వాటి బారిన పడకుండా చుట్టిముట్టి పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన దుప్పికి స్థానిక పశువైద్య అధికారుల చేత చికిత్స చేయించిన అనంతరం అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ముత్తుకూరు బీట్ అటవీ శాఖ సిబ్బంది శోభనాద్రి, రాధమ్మ గ్రామానికి చేరుకుని గాయపడిన దుప్పిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ దుప్పిని వైద్య చికిత్స కోసం పుంగనూరు ఎఫ్‌ఆర్వో కార్యాలయానికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు.

పత్తికొండలో పొలం పిలుస్తోంది!



పురుగుమందుల దుకాణంలో ఏడీఏ

గంగవరం: మండలంలోని పత్తికొండ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిణి హాజరయ్యారు. అంతకుముందు స్థానిక సొసైటీలో ఎరువులు, పురుగుమందులను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోందిలో పాల్గొని వ్యవసాయంలో రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏఓ హేమలత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: ఎక్సైజ్ పరిధిలోని రెండు కల్లు దుకాణాలకు ఆసక్తిగల వారు ఫిబ్రవరి 5లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఒక దుకాణాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ఈడిగ కులస్తులకు, రెండవ దుకాణం పెద్ద పంజాణి మండలంలో గాండ్ల కులస్తులకు కేటాయించామన్నారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు 5వ తేదీలోపు సమర్పించాలన్నారు. 7న కలెక్టర్ ఆధ్వర్యంలో చిత్తూరులో లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తామని తెలిపారు.

నేడు ఠాగూర్ విగ్రహావిష్కరణ

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం ఆవిష్కరణ చేయనున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి తయారు చేయించిన విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడిగా దేవేంద్ర

పలమనేరు: ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎలక్ట్రానిక్ మీడియా సంఘ ఉపాధ్యక్షుడిగా పలమనేరుకు చెందిన మహా న్యూస్ విలేకరి దేవేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు సాటి గంగాధరం, చల్లా జయచంద్ర ఆధ్వర్యంలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

నాణ్యత లోపిస్తే చర్యలు

కుప్పం: మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం అధికారులు తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులు, స్టాకు వివరాలు, వివిధ రకాల మందులపై ప్రశ్నించారు. పంట పొలాలకు అందించే మందుల్లో నాణ్యత ఉండాలని, దుకాణంలో ఎరువుల విక్రయాల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, టీఏ యామిని, కుప్పం ఎంఏఓ ఫయాజ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన

రొంపిచెర్ల: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రొంపిచెర్ల మండలంలో బుధవారం ఉదయం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ మంగళవారం తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని నగిరికి చెందిన కుమారరాజా కరెంట్ షాక్‌తో రెండు రోజుల క్రితం మృతిచెందాడు. మృతుని కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎమ్మెల్యే వస్తున్నారని తెలిపారు.

టి.వడ్డూరులో పడకేసిన పారిశుధ్యం



టి.వడ్డూరు మెయిన్ రోడ్డుపైన పేడ దిబ్బలు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. ఇక్కడి చెత్తచెదారాన్ని రోడ్డు పక్కనే పడేశారు. ఇవి పేరుకుపోయి రోడ్డు పైకి వస్తున్నాయి. వ్యర్థాలను శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. దీంతో పేడదిబ్బలతో గ్రామంలో కంపు తప్పడం లేదు. ఈ గ్రామంలో రెండు వేలకు పైగా జనాభా ఉన్నారు. గ్రామంలోని రోడ్డుకిరువైపులా పేడదిబ్బలు పేరుకుపోయాయి. ఇక వీధులో సీసీ రోడ్లు వేసినా డ్రైన్ల సమస్య నెలకొంది. కొన్ని వీధుల్లో వీధి దీపాలు సైతం లేవు. అసలే అంటు వ్యాధులు ఎక్కువగా ఉన్న తరుణంలో గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా మారడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ అయినా ప్రత్యేక చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్యాచ్ వర్క్‌ల్లో నాణ్యత ఏదీ?

- తారు రోడ్డు మరమ్మతులకు రూ.18 కోట్లు
- కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నేతల కోసమే ప్యాచ్ వర్క్‌లు



ప్యాచ్‌వర్క్ చేసినా అధ్వాన్నంగా కంచిబందార్లపల్లి రోడ్డు



కంకర్ తేలిన తారు రోడ్డు

కుప్పం: మహా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కుప్పంలో చేపట్టిన తారు రోడ్డు మరమ్మతుల్లో నాణ్యత కొరవడింది. నియోజకవర్గంలో తారురోడ్లలో ప్యాచ్‌వర్క్‌ల కోసం రూ.18 కోట్లు వెచ్చించినట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. కానీ పేరుకు మాత్రమే మరమ్మతులు చేశారే తప్ప రోడ్లలో గుంతలు, సన్నపాటి కంకర్లు ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్నాయి.

కొరవడిన నాణ్యత

నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రధాన రోడ్లకు మరమ్మతుల కోసం అధికార పార్టీ పనులు చేపట్టింది. మున్సిపాలిటీతో పాటు అన్ని మండలాల్లో తారు రోడ్డు ప్యాచ్ వర్కులు చేసేందుకు పనులు చేపట్టారు. చేపట్టిన పనులన్నీ అధ్వాన్నంగా మారాయే తప్ప పూర్తి స్థాయిలో గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. కుప్పం నుంచి శెట్టిపల్లి మీదుగా కంచిబందార్లపల్లికి వెళ్లే రోడ్డును రెండు నెలల క్రితం మరమ్మతులు చేశారు. ప్యాచ్‌లను కొత్తగా తారు వేశారే తప్ప ఒరిగిందేమీ లేదు. రోడ్డంతా చిన్నపాటి కంకర్లు తేలిపోయి నడవడానికి సైతం ఇబ్బందికరంగా మారింది. కుప్పం మండల పరిధిలోని పైపాళ్యం గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేశారు. పనులు జరిపి నెలలు గడవక ముందే రోడ్డంతా వేసిన తారు లేచిపోయి అధ్వాన్నంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో గుడుపల్లి రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు చేసినా ఫలితం లేకపోయింది. మరమ్మతులు చేపట్టిన చోట కంకర్లు తేలి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది.

కమీషన్ల కోసం...

నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతుల కోసం రూ.18 కోట్లు వెచ్చించినట్లు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. ఇవన్నీ కేవలం అధికార పార్టీ నేతలు, కాంట్రాక్టర్ల కమీషన్ల కోసమే అని స్పష్టంగా తెలుస్తోంది. అవసరమున్న చోట రోడ్లు వేయకుండా గుంతలు పూడ్చుకుంటూ నిధులు దుర్వినియోగం చేశారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పూడ్చిన గుంతల వల్ల ఒరిగిందేమీ లేదని, కేవలం కమీషన్లు, కాంట్రాక్టర్లను బతికించారే తప్ప సామాన్య ప్రజానికానికి మేలు జరగలేదు. రెండు నెలలుగా నియోజకవర్గంలో వేసిన ప్యాచ్ పనుల్లో తారు లేచి అధ్వానంగా తయారైంది.

జాగ్రత్తలు పాటిస్తే నివారణ



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చౌడేపల్లె: జాగ్రత్తలు పాటిస్తే కుష్ఠు, క్షయ వ్యాధులను నివారించడం సాధ్యమని జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం రావడం బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శరీరంపై స్పర్శలేని తెల్లని, నల్లటి మచ్చలు ఉన్న వారు పరీక్షలు చేసుకోవాలన్నారు. కుష్ఠు, క్షయ నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులను అందజేయడంతోపాటు టీబీ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.500 ఆర్థిక సాయం చేస్తుండడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు పూజ, పవన్‌కుమార్, నవీన్, డీపీఎంఓ దేవదాస్ పాల్గొన్నారు.

ఘనంగా నాగ ప్రతిష్ఠ



నాగప్రతిష్ఠ చేసిన భక్తులు

రామకుప్పం: స్థానిక స్వయంభు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పరిసరాల్లోని సంతానవనంలో మంగళవారం నాగప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. కర్ణాటకకు చెందిన ధరణిరెడ్డి, హేమలత సుబ్రహ్మణ్యస్వామికి సంతానవనంలో నాగప్రతిష్ఠ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు పార్థసారథి నాగరాజుశర్మ ఆధ్వర్యంలో నాగప్రతిష్ఠ చేశారు.

రంకెలేసిన పౌరుషం



కెంచనబల్ల మైలేరులో దూసుకెళ్తున్న ఎద్దు



గొల్లచీమనపల్లెలో పరుగులు తీస్తున్న పశువు

రామకుప్పం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని కెంచనబల్ల గ్రామంలో మంగళవారం మైలేరు పండుగ కోలాహలంగా జరిగింది. ఉదయం గ్రామదేవత ఆలయంలో గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ పశువులను బరిలో పరుగెత్తించారు. మైలేరు పండుగను తిలకించేందుకు వందలాదిగా జనం తరలి రావడంతో కెంచనబల్ల వీధులు కిక్కిరిశాయి. ఎద్దులను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. బారికేడ్లు అవతల ఎద్దులు వేగంగా దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అత్యంత వేగంగా పరుగులు తీసిన ఎద్దు యజమానులకు నగదు, వస్తు బహుమతులు అందజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని గొల్లచీమనపల్లెలో మంగళవారం మైలేరు పండుగ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం గ్రామ దేవత ఆలయం వద్ద పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మైలేరులో వదిలిపెట్టారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి వందలాది పశువులు మైలేరులో పాల్గొన్నాయి. నువ్వా...నేనా అంటూ దూసుకుపోతున్న పశువులపై యువకులు చేయివేసి వాటిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. గొల్లచీమనపల్లెలో మైలేరు నిర్వహించడంతో యువతలో జోష్ వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామస్తులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మైలేరులో గెలుపొందిన పశువుల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.